సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



వైభవంగా బ్రహ్మోత్సవాలు

గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



తగ్గిన ఉల్లి ధరలు

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉల్లి ధరలు మరింత పడిపోయాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.7 /15.8

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. తేమ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జెడ్పీ మీటింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీలు సభ్యులతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు అందరూ సకాలంలో సభకు హాజరు కావాలని సూచించారు.

అడిగిన ప్రతి ఒక్కరికి ‘ఉపాధి’ పని

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని డీఆర్‌డీఓ నర్సింహులు తెలిపారు. వనపర్తి సీఈఓగా ఉన్న ఈయన మహబూబ్‌నగర్ డీఆర్‌డీఓగా బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. దీంతో పాటు మహిళా సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళ సంఘాల బలోపేతం కోసం డీపీఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. అంతకుముందు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాఖ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గద్వాల డిప్యూటీ సీఈఓగా ఉన్న ముషాహిదాబేగం మహబూబ్‌నగర్ అడిషనల్ డీఆర్‌డీఓగా బాధ్యతలు స్వీకరించారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



కోస్గి: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి జిల్లాకు రానున్నారని, ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అక్కడి అధికారులను ఆదేశించారు. సీఎం ఈ నెల 18న కోస్గిలో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్‌తోపాటు ఎస్పీ యోగేష్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణ శివారులోని తాండూర్ రోడ్డులో ఏర్పాటు చేసే హెలిప్యాడ్ స్థలంతోపాటు ప్రభుత్వ ఇంజినీరింగ్, మహిళా డిగ్రీ కళాశాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ముఖ్యమంత్రి భూమిపూజ చేసి శిలాఫలకం వేస్తారని, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు ఒకేచోట ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం లక్ష్మీ నర్సింహా ఫంక్షన్ హాల్, మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే సభకు సంబంధించి వీవీఐపీ, వీఐపీ స్టేజీలు, భోజన వసతి, పోలీస్ శాఖ ఏర్పాటు చేసే భారీ కేడ్లు, భద్రత, పార్కింగ్ అంశాలపై ఎస్పీతో చర్చించారు. అనంతరం ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కోసం 1737 సర్వే నంబర్‌లో గుర్తించిన 16.34 ఎకరాల ఎండోమెండ్ భూమిని పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ సోమనర్సయ్య, ఎస్సై శేఖర్ గౌడ్‌తోపాటు ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ‘బీసీల రాజ్యాధికారం-రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ కులాల పాత్ర’ అనే అంశంపై అన్ని కులసంఘాల నేతలు, పెద్దలతో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి రాష్ట్ర బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, బీసీ సమాజ్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు పి సతీష్ సాగర్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

పల్లి.. ధర పల్లీ

అమాంతం తగ్గిన రేట్లు

సాక్షి ఫోకస్

ఆరుగాలం శ్రమించి పండించిన వేరుశనగను అమ్ముకునేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మార్కెట్లలో వ్యాపారులు, దళారులు, కమీషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధరల్లో కోత పెడుతుండడం.. అధికారుల పట్టింపు లేమి వెరసి వారిలో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే అచ్చంపేట, జడ్చర్ల, కల్వకుర్తిలో రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. అచ్చంపేటలో మార్కెట్ ముట్టడి, చైర్‌పర్సన్‌పై దాడి ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. మంగళవారం మహబూబ్‌నగర్ మార్కెట్‌లో సైతం అలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. కన్నెర్ర చేసిన రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయంలోని బెంచీలు, బీరువాలు, కుర్చీలు, అద్దాలు ధ్వంసం చేశారు. ఆ తర్వాత భారీ ర్యాలీతో పాటు ధర్నా చేపట్టారు. తాజాగా బుధవారం అచ్చంపేటలో మరోసారి రైతులు రోడ్డెక్కారు. ఈ నేపథ్యంలో మార్కెట్లలో నెలకొన్న పరిస్థితులు, వేరుశనగ రైతుల దీనావస్థపై ‘సాక్షి’ ఫోకస్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



గిట్టుబాటు ధర రాకపోవడంతో మహబూబ్‌నగర్ మార్కెట్‌లో వేరుశనగ కుప్పల వద్ద రైతుల పడిగాపులు

- ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లదే ఇష్టారాజ్యం
- శాస్త్రీయత మరిచి అరచేతిలో తేమ శాతం లెక్కింపు
- వారు చెప్పిందే ధర.. లేకుంటే అంతే సంగతులు
- ఇదిచాలదంటూ చాట కూలీల దోపిడీ పర్వం
- ఆందోళన బాటలో వేరుశనగ రైతులు
- కుంటి సాకులతో అధికారుల దాగుడుమూతలు

1,52,279 ఎకరాల్లో సాగు..

ఉమ్మడి జిల్లాలో వరి ప్రధాన పంట. సాగు నీటి వనరులు పెరిగిన తర్వాత రైతులు వరికే మొగ్గు చూపుతున్నారు. అయితే వేరుశనగ సాగుకు ఇక్కడి నేలలు అనువుగా ఉండగా.. నాణ్యమైన గింజలు ఉత్పత్తి అవుతాయనే పేరుంది. అంతకు మునుపు ఏడాది గిట్టుబాటు ధరకు మించి కొనుగోళ్లు జరగడంతో గత రబీలో రైతులు ఎక్కువగా ఈ పంట సాగు చేశారు. ఉమ్మడి పాలమూరులో సుమారు 1,52,279 ఎకరాల్లో వేరుశనగ సాగైనట్లు వ్యవసాయ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మేరకు అన్ని మార్కెట్లకు వేరుశనగ పోటెత్తుతోంది.

అడుగడుగునా దోపిడీ..

మార్కెట్లలో ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్ల (గుమస్తాలు)దే ఇష్టారాజ్యంగా మారింది. శాస్త్రీయతను పక్కనబెట్టి అరచేతిలో వేరుశనగ కాయలను ఎగురవేస్తూ నాణ్యత లెక్కిస్తున్నారు. వారు చెప్పిందే ధర. అంతేకాకుండా తరుగు పేరిట ధరల్లో కోత పెడుతున్నారు. ఇది చాలదంటూ చాట కూలీలు ఒక్కో రాశి వద్ద బస్తాకు పైగా దోపిడీ చేస్తున్నట్లు పరిశీలనలో తేలింది. మార్కెట్ సెక్రటరీలు, అధికారులు సైతం ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లకే వత్తాసు పలుకుతుండడంతో రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

తగ్గిన దిగుబడి, తగ్గిన ధరతో..

గత సీజన్‌లో వాతావరణంలో మార్పులు, నల్లమచ్చ తెగుళ్లు, వర్షాభావం కారణంగా వేరుశనగ దిగుబడి సగానికి తగ్గింది. ఎకరా సాగు కోసం విత్తనాలకు రూ.14,200 నుంచి రూ.16 వేలు సహా ఎరువులు, కూలీలు ఇలా అన్ని ఖర్చులు కలిపి రైతులకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు పెట్టుబడి అయినట్లు అంచనా. కాలం కలిసొచ్చి బాగా పండితే 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కానీ వర్షాభావంతో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకే దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో ధర సైతం అమాంతంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీస పెట్టుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కారణాలు ఇవే..

❒ ఉమ్మడి జిల్లాలో నాణ్యతతో కూడిన వేరుశనగ పంట ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి సైతం ఇక్కడకు వచ్చి కొనేందుకు పోటీ పడుతుంటారు. ఈ సారి బయటి వ్యాపారులను రానీయకుండా స్థానిక ట్రేడర్లు అడ్డుకుంటున్నారు. పోటీ లేకపోవడంతో మార్కెట్ అధికారులతో స్థానిక ట్రేడర్లు తక్కువ ధర పెడుతూ మోసం చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❒ వేరుశనగ రాక ఇప్పుడిప్పుడే ఊపందుకుంది. మార్కెట్‌కు ఒక్కసారిగా పోటెత్తడంతో అదునుగా భావించి వ్యాపారులు ధర తగ్గించినట్లు తెలుస్తోంది.

❒ ఎకరా వేరుశనగ సాగుకు క్వింటాల్ విత్తనాలు అవసరం. గతేడాది క్వింటాల్ విత్తనాలకు రూ.11 వేలు కాగా.. పంట అమ్మకానికి వచ్చేసరికి మార్కెట్‌లో సగటున క్వింటాల్‌కు రూ.8,300 పలికింది. అదే ఈ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ విత్తనాలకు రూ.4 వేల నుంచి రూ. 5 వేలు పెంచారు. ఈ మేరకు గత ఏడాదికి మించి ధర పెరగకపోగా.. మద్దతు ధర కూడా రాని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

❒ మార్కెట్లలో వ్యాపారులు నాలుగైదు రాశులకు మాత్రమే అత్యధిక ధర పెడుతున్నారు. మిగతా అంతా రూ.4వేల నుంచి రూ.5 వేలు, ఇంకా అంటే రూ.5,500 వరకు మాత్రమే ధర పెడుతుండడంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు.

ప్రభుత్వం క్వింటాల్ వేరుశనగకు రూ.6,377 మద్దతు ధర ప్రకటించింది. గత ఏడాది మద్దతు ధరకు మించి క్వింటాల్‌కు రూ.8,900 వరకు ధర పలకగా.. సగటు రూ.7,500తో కొనుగోలు చేశారు. కానీ ఈసారి ధర తగ్గింది.

ఒక్కో చోట ఒక్కో ధర..

ఈ సీజన్ ప్రారంభంలో అత్యధికంగా క్వింటాల్‌కు రూ.8,500 ధర పలికినప్పటికీ.. సరాసరిగా రూ.5 వేల నుంచి రూ.5,500 తోనే విక్రయాలు జరిగాయి. మరోవైపు ఉమ్మడి జిల్లా పరిధిలోని మార్కెట్లలో కొనుగోలు ధరల్లో తేడా ఉంటోంది. ఒక్కో చోట ఒక్కో ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో వేరు శనగ సాగు, కొనుగోళ్ల వివరాలు..

జిల్లా	సాగు (ఎకరాల్లో)	కొనుగోలు చేసింది (క్వింటాళ్లలో)
మహబూబ్‌నగర్	10,482	2,13,936
వనపర్తి	20,421	1,73,726
నాగర్‌కర్నూల్	97,156	1,10,000
నారాయణపేట	7,981	22,698
జోగుళాంబ గద్వాల	16,239	1,03,000
మొత్తం	1,52,279	6,23,360



మార్కెట్ల వారీగా పలికిన అత్యధిక ధరల్లో తేడాలు (క్వింటాల్‌కు రూపాయల్లో)

మార్కెట్	సీజన్ మొదట్లో..	వారం క్రితం	ప్రస్తుతం
వనపర్తి	8,532	7,180	6,800
మహబూబ్‌నగర్	8,210	7,250	7,090
గద్వాల	8,450	6,700	6,600
నారాయణపేట	7,310	6,090	5,950
జడ్చర్ల	8,300	7,350	7,100
కల్వకుర్తి	8,000	7,316	6,829
అచ్చంపేట	8,080	7,060	7,029
నాగర్‌కర్నూల్	6,600	6,500	6,400

రూ.7 వేలు పెడితేనే పెట్టుబడి వచ్చేది..



నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. ఎకరాకు రూ.14,400 పెట్టి విత్తనాలు కొన్నా. మందులు, విత్తనాల ధరలను అమాంతంగా పెంచారు. కూలీల రేట్లు తడిసి మోపెడయ్యాయి. రూ.1.40లక్షల వరకు పెట్టుబడి అయింది. పందుల బాధ విపరీతంగా ఉంది. ఉదయం, రాత్రి కంటి మీద కునుకులేకుండా కాపలాకాసి పంటలు కాపాడుకున్నాం. చివరకు అమ్ముదామని మహబూబ్‌నగర్ మార్కెట్‌కు వస్తే గిట్టుబాటు ధర దక్కడం లేదు. క్వింటాల్‌కు రూ.6,200 ఇస్తామంటున్నారు. కనీసం రూ.7 వేలతోనైనా కొనుగోలు చేయాలి. లేకుంటే పెట్టుబడి కూడా రాదు.

– సురేష్, సొకలిపల్లి, చౌదాపూర్, వికారాబాద్

అధికారుల కళ్ల ముందే దోపిడీ..



నేను 3 ఎకరాల్లో పల్లి పంట వేశా. 70 బస్తాల వరకు రాగా.. అమ్ముదామని మహబూబ్‌నగర్ మార్కెట్‌కు తీసుకొచ్చా. వ్యాపారులు వచ్చి చూశారు. ఒకరు వచ్చి కుప్పలు చూసి పోయారు. మళ్లీ వచ్చి వేరుశనగ కాయలను చేతిలో తీసుకుని గాల్లోకి ఎగిరేసి.. రూ.6,700 పెడతామన్నారు. పక్కన వాళ్లవి కొంటుంటే చూశా. చాట కూలీలు ఒక్క రాశి నుంచి బస్తా వరకు పల్లి కాయలు తీసుకున్నారు. వాటిని సగం రేటుతో ఆ వ్యాపారులకే అమ్ముతారట. అధికారుల కళ్లెదుటే దోపిడీ జరుగుతున్నా.. వారు పట్టించుకోవడం లేదు. కనీసం రూ.7,500తోనైనా కొనుగోలు చేయాలి.

– చెన్నయ్య, కుల్కచర్ల, గండేడ్, మహబూబ్‌నగర్

వ్యాపారులు కుమ్మక్కైయ్యారు..



మార్కెట్‌కు పల్లీలు తెస్తే వ్యాపారులు కుమ్మక్కై ధర పెట్టడం లేదు. గ్రాము లెక్కన (అవుటాన్) తీయడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. వారు నిర్ణయించిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. పంట మొత్తం ఇచ్చిన పెట్టుబడి కింద సగం అప్పుకు సరిపోవడం లేదు. తాను 5 ఎకరాల్లో సాగు చేశా. 120 బస్తాలు మార్కెట్‌కు తేస్తే 6,300 ధర వేశారు.

– నలగంటి కృష్ణయ్య, రైతు, మానాజీపేట లింగాల మండలం

చర్యలు తీసుకుంటున్నాం..

స్థానికంగా పండించిన వేరుశనగతో పాటు నల్లగొండ, దేవరకొండ నుంచి అచ్చంపేటకు అత్యధికంగా వస్తున్నాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. కొనేందుకు వ్యాపారులు ఎక్కడి నుంచైనా రావొచ్చు.

– బాలమణి, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు



అచ్చంపేటలో ఆందోళన చేపట్టిన రైతులు

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జడ్చర్ల: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. బుధవారం మిడ్జిల్ జెడ్పీహెచ్ఎస్‌లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన విద్యా అవగాహన సదస్సుకు కలెక్టర్, డీఈఓ రవీందర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లను దూరం పెట్టాలని సూచించారు. పదో తరగతి ఫలితాలు భవిష్యత్ ఉన్నత చదువులపై ప్రభావం చూపుతాయన్నారు. చదువుకు మించిన ఆస్తిలేదన్నారు. వంద శాతం ఫలితాలు సాధించి మిడ్జిల్‌కు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. చదువును అశ్రద్ధ చేస్తే భవిష్యత్ ఉండదని అన్నారు. సబ్జెక్టుల వారీగా తయారు చేసిన బిట్ బ్యాంకును ఆవిష్కరించారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ.. పరీక్షలపై విద్యార్థులు భయాందోళనలు వీడాలని, ఎప్పటికప్పుడు అనుమానాలు, సందేహాలను నివృత్తి చేసుకుంటూ సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఏఎంఓ శ్రీనువాసులు, తహసీల్దార్ రాజు నాయక్, ఎంపీటీసీ గౌస్, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ త్వరితగతిన చేపట్టండి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గొర్రెల యూనిట్ల పంపిణీ త్వరితగతిన చేపట్టాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా చైర్మన్ శాంతయ్యయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ రవినాయక్‌ను కలిసి విన్నవించారు. ఒక్కో యూనిట్‌కు రూ.43,750 చెల్లించారని, జిల్లాలోని 15 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. కలెక్టర్ ఖాతాలో డబ్బులు జమ చేసి 9 నెలలు కావస్తున్నా పంపిణీ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. డబ్బులు చెల్లించి ఇబ్బందులు పడుతున్న గొర్రెల కాపరులకు యూనిట్లు గ్రౌండింగ్ చేస్తే మేలు కలుగుతుందని కోరారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సాయిలు యాదవ్, రాజగోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనాన్ని పరిశీలించిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్ భవనాన్ని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ బుధవారం పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని, నాణ్యత లేకుండా నిర్మిస్తే బిల్లుల నిలిపివేస్తామని వీసీ కాంట్రాక్టర్‌ను సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, చీఫ్ వార్డెన్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రరావు



జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, డిప్యూటీ సీఈఓ శర్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ ఉద్యోగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విధి నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యం వహించొద్దని జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు అన్నారు. బుధవారం ఆయన జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండుశ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ శర్మను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం పనిచేయాల్సి ఉంటుందన్నారు. స్థానిక సంస్థల పరిధిలోకి వచ్చే జిల్లా పరిషత్ ఉద్యోగులు సభ్యులైన జెడ్పీటీసీలను గౌరవించాలని సూచించారు. జెడ్పీ సర్వసభ్య, స్టాండింగ్ కమిటీ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లాకు కేటాయించిన 12 మంది ఎంపీడీఓలు జెడ్పీ సీఈఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శరత్‌చంద్రబాబు, ప్రభాకర్, కరుణశ్రీ, బాల్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీహరి, ఆనంద్, శ్రీనివాస్, హరీశ్వర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



నిజరూప దర్శనం.. భక్తి పారవశ్యం

అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని భక్తులకు అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం కల్పించారు.

8లో..

– అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం

జిల్లాకు 12 మంది కొత్త ఎంపీడీఓలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో 12 మండలాలకు కొత్త ఎంపీడీఓలు వచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా నాగర్‌కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, సిద్దిపేట నుంచి జిల్లాలకు వచ్చారు. వీరికి గురువారం కలెక్టర్ రవినాయక్ మండలాలను కేటాయించగా.. ఆయా మండలాల్లో బాధ్యతలు సైతం స్వీకరించారు.

ఎంపీడీఓ	ప్రస్తుత జిల్లా	కొత్త పోస్టింగ్
కె.దేవన్న	నాగర్‌కర్నూల్	గండేడ్
ఎం.క్రిష్ణయ్య	నాగర్‌కర్నూల్	మూసాపేట
ఎం.గీతాంజలి	నాగర్‌కర్నూల్	మిడ్జిల్
కె.కరుణశ్రీ	నాగర్‌కర్నూల్	మహబూబ్‌నగర్
కె.ప్రభాకర్	నాగర్‌కర్నూల్	భూత్పూర్
కాళప్ప	నారాయణపేట	కోయిల్‌కొండ
బి.శ్రీనివాస్	నారాయణపేట	అడ్డాకుల
బి.యశోదమ్మ	నారాయణపేట	హన్వాడ
సుధాకర్‌రెడ్డి	నారాయణపేట	సీసీ కుంట
శరత్‌చంద్రబాబు	రంగారెడ్డి	బాల్‌నగర్
బాల్‌రెడ్డి	రంగారెడ్డి	జడ్చర్ల
మచ్చేందర్	సిద్దిపేట	రాజాపూర్

బాధ్యతలు స్వీకరించిన కొత్త మున్సిపల్ కమిషనర్



డి.మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నిజామాబాద్‌లో ఏఎంసీగా పనిచేస్తూ పాలమూరు మున్సిపాలిటీకి ఎఫ్ఏసీగా బదిలీపై వచ్చిన డి.మహేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఇక కొత్త మున్సిపల్ కమిషనర్‌ను చైర్మన్ ఎ.ఆనంద్ గౌడ్, వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు సన్మానించారు. అలాగే ఏఎంసీ జె.పవన్‌కుమార్, మేనేజర్ వెంకటేశ్వరావుతో పాటు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది సైతం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మరో 14 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తాజాగా 14 మంది మున్సిపల్ కమిషన్లు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని సి.సత్యబాబును జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ కమిషనర్‌గా, రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా పనిచేస్తున్న డి.శంకర్‌సింగ్ గద్వాల మున్సిపాలిటీకి వస్తున్నారు. అలాగే అలంపూర్ నుంచి జి.నర్సయ్య సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌కు వెళుతుండగా, వికారాబాద్ జిల్లాలోని పరిగి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసన్ నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు వస్తున్నారు. గద్వాలలోని కె.నర్సింహ వరంగల్ జిల్లాలోని పరకాలకు, వనపర్తి జిల్లా అమరచింత నుంచి ఎండీ ఖాజా సూర్యాపేట జిల్లాలోని నేరెడుచర్లకు వెళుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నుంచి ఎండీ షేక్ హైదరాబాద్ జీహెచ్ఎంసీకి, కేవీ రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ నుంచి పి.భోగేశ్వర్లు నారాయణపేట జిల్లాలోని మక్తల్‌కు, మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ నుంచి పి.సరస్వతి గద్వాల జిల్లాలోని అలంపూర్‌కు బదిలీ అయ్యారు. ఇక వనపర్తి నుంచి ఎస్.భాస్కర్‌రెడ్డి నల్లగొండ జిల్లాలోని దేవరకొండకు, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీలో డీసీగా పనిచేస్తున్న ఎస్.ఎన్.సూర్యకుమార్ వనపర్తి జిల్లాలోని కొత్తకోటకు, కేవీరంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ నుంచి శ్యాంసుందర్ నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటకు వస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నుంచి వెంకటయ్య వికారాబాద్ జిల్లాలోని పరిగికి, కేవీరంగారెడ్డి జిల్లాలోని జల్‌పల్లి మున్సిపాలిటీ మేనేజర్‌గా పనిచేస్తున్న వై.సుదర్శన్ పదోన్నతిపై వనపర్తికి కమిషనర్‌గా వస్తున్నారు. వీరందరూ వెంటనే విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సయ్యద్ ఇమ్రాన్ అహ్మద్ (ఫైల్)

వంగూరు: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన వంగూరు మండలం ఉల్పర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల మేరకు.. ఉల్పరకు చెందిన సయ్యద్ ఇమ్రాన్ అహ్మద్ (33) ఇంటి సంప్ వద్ద ఉన్న విద్యుత్ మోటార్ బుధవారం పనిచేయలేదు. ఈక్రమంలో విద్యుత్ మోటార్‌ను అతడు చేతితో పట్టుకుని చూస్తుండగా.. షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇమ్రాన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఇంతియాజ్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ తీస్తూ..


పూజ (ఫైల్)

మహమ్మదాబాద్: విద్యుదాఘాతానికి గురై ఓ యువతి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. నారాయణపేట జిల్లా కొత్తపల్లి తండాకు చెందిన బేణిక్య మంగళవారం చిన్న కుమార్తె పూజ(18)తో కలిసి మండలంలోని పగిడ్యాల్ పలుగుతండాలో ఉండే పెద్ద కుమార్తె సోని ఇంటికి వచ్చారు. రాత్రి తుల్జాభవాని పూజ ముగిసిన అనంతరం 11.30 ప్రాంతంలో చిన్న కుమార్తె పూజ ఇంట్లో ఛార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలింది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండాలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్తింగ్ సరిగా లేకపోవడంతో విద్యుత్ ప్రమాదం జరిగిందని.. ఇందుకు సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జమిస్తాపూర్ గేట్ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెల్కపల్లి మండలం కార్వంగకి చెందిన శంకరయ్య(38) ద్విచక్రవాహనంపై మంతటిలో శుభకార్యానికి వెళ్లి బుధవారం రాత్రి కార్వంగకి తిరిగి వెళ్తున్నాడు. జమిస్తాపూర్ గేట్ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానవపాడు: మండలంలోని జల్లాపురం సమీపంలో ఎన్‌హెచ్–44పై రెండు రోజుల కిందట బైక్‌పై నుంచి కిందపడి గాయపడ్డ అమర్ ప్రసాద్ (34) బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన అమర్‌ప్రసాద్ బైక్‌పై కర్నూల్‌కు వచ్చి, తిరిగి వెళ్తుండగా.. జల్లాపురం సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. అతడిని కర్నూల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

బాలానగర్: మండలంలోని ఉడిత్యాలకు చెందిన ఎర్రం నర్సింహులు (40) మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుప్పాజి తెలిపారు. భార్య ఎర్రం లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని.. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు.

అనారోగ్యంతో మనస్తాపం చెంది..

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తూడుకుర్తిలో మంగళవారం చోటు చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. తూడుకుర్తికి చెందిన ఎల్లయ్య (65) చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఈయన గ్రామ సమీపంలోని వ్యవసాయపొలంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ఆది దంపతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు


గ్రామదేవతల వేషధారణలో కళాకారులు

నిజరూప దర్శనం.. భక్తి పారవశ్యం


కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న భక్తులు



- భక్తజనాన్ని అనుగ్రహించిన జోగుళాంబదేవి
- ప్రదోష కాలంలో శాంతి కల్యాణం
- ధ్వజావరోహణతో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబదేవి నిజరూప దర్శనంతో భక్తిపారవశ్యం ఉప్పొంగింది. ''లంబస్థనీం వికృతాక్షీం ఘోరరూపం మహాభలాం ప్రేతాసన సమారూఢాం జోగుళాంబాం నమామ్యహం'' అంటూ భక్తులు శరణు కోరగా.. జోగుళాంబదేవి నిజరూప మహాద్భాగ్యాన్ని అనుగ్రహించారు. జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజైన బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని భక్తులకు అమ్మవారి నిజరూప దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛరణలతో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలు కలిపిన జలాలతో అమ్మవారిని అభిషేకించారు. ఈ ఘట్టాన్ని తిలకించిన భక్తులు.. తన్మయం చెందారు.

ఆధ్యాత్మిక శోభ..

జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. జోగుళాంబ సేవాసమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌శర్మలు హరిశ్చంద్ర ఘాట్‌లో వెలసిన అష్టభుజి జోగుళాంబ గంటలేశ్వర ఆలయం నుంచి జాతరను ప్రారంభించారు. గ్రామదేవతల వేషధారణలతో 40 మంది కళాకారుల నృత్యాల మధ్య జోగుళాంబదేవి శకటం ముందుకు కదిలింది. భక్తులు కలశాలతో ఊరేగింపుగా తరలిరావడంతో అలంపూర్ పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

సహస్ర ఘట్టాలకు ప్రత్యేక పూజలు..

అమ్మవారి కుంకుమార్చన మండపంలో సర్వతోభద్రమండలిపై స్థాపించిన 1008 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. సప్తనదీ జలాలను ఆయా కలశాలలో వేసి, వేదమంత్రోచ్ఛరణల మధ్య అభిమంత్రించారు. అనంతరం భక్తులు వాటిని శిరస్సున ధరించి ఓం శ్రీమాత్రేనమః అంటూ అమ్మవారి గర్భాలయానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన శ్రీచక్ర రాజము, అమ్మవారి ఉత్సవ మూర్తులు, మూలమూర్తులను కలశాలతో అభిషేకించారు.

ఆది దంపతుల కల్యాణం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ధ్వజస్తంభ మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి, అమ్మవారి కల్యాణం కమనీయంగా సాగింది. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే విజయుడు హాజరు కాగా.. ఆలయ అధికారులు స్వాగతం పలికారు.


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహా పూర్ణాహుతితో పరిసమాప్తి..

అమ్మవారి యాగశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న చండీహోమాలు, ఆవాహిత దేవతా హోమాలకు చివరి రోజు మహా పూర్ణాహుతి సమర్పించి, బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అలాగే యాగరక్షను అమ్మవారి మూలవిరాట్‌కు సమర్పించిన అనంతరం భక్తులకు అందజేశారు. యాగశాలలోని కలశాలను ఉద్వాసన చేసి, వాటిని ఊరేగింపుగా గర్భాలయానికి తీసుకెళ్లారు. ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దశవిధ హారతులు సమర్పించారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులకు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు

తాగుడుకు బానిసై వృద్ధుడి బలవన్మరణం

దేవరకద్ర: కొకుంట్ల మండలం పుట్టపల్లిలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుందని ఎస్‌ఐ నాగన్న తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి కొత్తకోట మండలం అప్పరాలకి చెందిన పాకనాటి చంద్రాయుడు(64) తాగుడుకు బానిసై తరచు భార్యను వేధించేవాడు. దీంతో భర్తతో వేగలేక భార్య పద్మమ్మ తన పుట్టినిల్లు అయిన కొకుంట్ల మండలం పుట్టపల్లికి రెండు రోజుల కిందట వెళ్లింది. ఈ నెల 13న చంద్రాయుడు పుట్టపల్లికి వెళ్లి తన భార్యను అప్పరాలకు రమ్మని కోరాడు. తాగి గొడవ పడుతున్నావని, తాను రానని చెప్పేసింది. దీంతో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. తాను పురుగు మందు తాగానని తెలియజేశాడు. వెంటనే వారు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

లైంగికదాడి కేసులో ఇద్దరికి జీవితఖైదు

భూత్పూర్: లైంగికదాడి కేసులో ఇద్దరికి జిల్లా కోర్టు జడ్జి పాపిరెడ్డి జీవితఖైదు విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. భూత్పూర్ మున్సిపాలిటీలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు అమిస్తాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో ఆ మహిళ 2016 ఆగస్టు 8న రాత్రి తన కూతురికి మత్తు మందు ఇచ్చి, శ్రీనివాస్‌తో లైంగికదాడి చేయించింది. మరుసటి రోజు ఉదయం మత్తు నుంచి తేరుకున్న ఆమె కుమార్తె.. ఒంటిపై వేసుకున్న దుస్తులు లేకపోవడంతో ఆశ్చర్యానికి గురైంది. గ్రామ పెద్దల సహాయంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లిపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ అశోక్, సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో కేసు నమోదైంది. జిల్లా కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో బాధితురాలి తల్లితో పాటు, లైంగిక దాడికి పాల్పడిన శ్రీనివాస్‌కు జీవితఖైదుతో పాటు రూ.2,500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక వివాహిత..

నర్వ: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాయికోడ్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కురుమయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయికోడ్‌కి చెందిన కందుకూరి హనుమంతుకు సీసీకుంట మండలం పల్లమర్రికి చెందిన భాగ్యమ్మ(33)తో 12 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కూమార్తెలు ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను తరచూ వేధించేవాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు చోటుచేసుకునేవి. గతంలో కుటుంబ సభ్యులు ఇద్దరికి సర్దిచెప్పి ఆమెను కాపురానికి పంపించారు. అయినా అతను భార్యను వేధింపులకు గురిచేస్తుండేవాడు. బుధవారం భర్త గొడవపడగా.. ఇంట్లోనే చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. చుట్టు పక్కల వారు తలుపులు బద్దలుకొట్టి ఆమెను దించి చూడగా.. అప్పటికే మృతిచెందింది. మృతురాలి తమ్ముడు మంద శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు.

నల్లబెల్లం పట్టివేత: కేసు నమోదు

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి చౌరస్తాలో బుధవారం తెల్లవారుజామున కారులో తరలిస్తున్న నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. పోలీస్ వాహనాన్ని గమనించిన కారు అక్కడే వదిలేసి పారిపోయారని, కారులో 18 బస్తా ల్లో 5క్వింటాల నల్లబెల్లం ఉన్న ట్లు పోలీసులు పేర్కొ న్నా రు. కారు, డ్రైవర్‌పై కేసు న మోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

పంటల్లో సస్యరక్షణ-జాగ్రత్తలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంటల సాగులో జాగ్రత్తలు అవసరం. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో చీడ పీడల వ్యాప్తి అధికంగా ఉంటుంది. రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. పంట సాగులో తగు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలను నివారించుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, వరిలో మెడవిరుపు తెగుళ్ల ఆశిస్తున్నట్లు తెలిపారు. వాటి నివారణకు ఈ విధంగా వివరించారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. మొలక దశ నుంచి కొంత ఏపుగా పెరగడంతో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే ఆశించిన దిగుబడి సాధించవచ్చు.

నివారణ

ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించిన పంటకు ముందుగా వేప నూనె 1500 పీపీఎంలను 5 లీటర్ల నీటికి క్లోరిపైరిఫాస్ 50 మి.లీ.తో కలిపి పిచికారి చేసుకోవాలి. తర్వాత థయోమిథాక్సమ్ 12.6 శాతం, లామ్డాసైహలోత్రిన్ 9.5 శాతం, ఎస్‌సీ 0.5 మి.లీ. లేదా క్లోరాన్ ట్రనోలిపోల్ 18.5 శాతం ఎస్‌సీ 0.4 మి.లీ లేదా స్పైనోటోరమ్ 11.7 శాతం ఎస్‌సీ 0.5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడంతో పురుగు ఉధృతి నివారణకు అవకాశం ఉంటుంది.

వరిలో మెడవిరుపు

వరిలో మెడవిరుపు తెగుళ్లు ఆశిస్తుంది. జిల్లాలో సాగు చేసిన వరిలో ఈ తెగుళ్లు ఆశించినట్లు పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో కోతకు వచ్చే సమయంలో ఈ తెగుళ్ల రైతులకు నష్టాలకు గురి చేస్తోంది.


వరిలో మెడవిరుపు తెగులు ఆశించిన వరి పంట

ఇవి ఆశించడం వలన కంకి కింద నల్లటి లేదా ఎర్రటి మచ్చలు ఏర్పడి కంకి కిందికి వాలుతుంది. రైతులు నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర రూపం దాల్చుతుంది.

నివారణకు

వరిలో మెడవిరుపు నివారణకు చర్యలు చేపట్టాలి. దీని కోసం ట్రైసైక్లోజోల్ అనే శిలీంద్ర నాశిని 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి కంకి కింద బాగా తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

జడ్చర్ల టౌన్: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఈసందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్య పూజలతో పాటు శేష, గజవాహన సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, భాజాభజంత్రీల మధ్య ఊరేగించారు. గురువారం పుష్ప రథోత్సవం నిర్వహించనున్నారు. గ్రామంలో ఏర్పాటుచేసిన మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.


గంగాపురంలో లక్ష్మీచెన్నకేశవస్వామికి శేషవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గట్టుతిమ్మప్ప పల్లకీసేవ

- స్వామి వారికి పుష్కరస్నానం
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు


మాద్వార్‌లో రాజేశ్వర్‌రావు ఇంట్లో స్వామివారికి పూజలు చేస్తున్న వేదపండితులు

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో గట్టుతిమ్మప్పస్వామి(లక్ష్మీవేంకటేశ్వరస్వామి) పల్లకీసేవ బుధవారం గ్రామంలో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని రాజేశ్వర్‌రావు ఇంటి నుంచి కొండపైకి తీసుకొచ్చి కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణా నది నుంచి పుష్కర నీటిని తీసుకొచ్చి స్వామివారికి వేదపండితులతో పుష్కర స్నానం చేసి, పాలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవ సందర్భంగా భక్తులు కోలాటం, చిన్నారులు నృత్యాలు, అడుగుల భజనలు చేస్తూ.. ఊరేగింపుగా వెళ్లారు. గతంలోకంటే ఈ సారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవాలకు వివిధ ప్రాంతాలతో పాటు చుట్టపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు 101 మంగళహారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం గుట్టుకింద భాగంలోని పద్మావతి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర భక్తులు పాల్గొన్నారు.


మాద్వార్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా వసంతపంచమి వేడుకలు

- బీచుపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, మహా నైవేద్య నీరాజనాలు, వడిబియ్యం వంటి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, సరస్వతీమాతను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్రాచారి, దినకరన్ ఆచార్యుల ఆధ్వర్యంలో దాదాపు 200 మంది చిన్నారులతో సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. గద్వాల మండలం సంగాలకు చెందిన కాంట్రాక్టర్ అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

యాంకి చెరువులో మొసలి కలకలం

నర్వ: మండలంలోని యాంకి చెరువులో కొంత కాలంగా మొసలి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇది రాత్రి వేళల్లో చెరువు గట్టుపైకి వచ్చి చేరడంతో భయాందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. చెరువు గ్రామానికి పక్కనే ఉండడంతో ఇళ్ల మధ్యకు వచ్చే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మొసలి బారి నుంచి ఫారెస్టు అధికారులు కాపాడాలని వారు కోరుతున్నారు.


యాంకి చెరువు గట్టుపై ఉన్న మొసలి

ఫిట్స్ రావడంతో అదుపుతప్పిన బైక్

- ముగ్గురికి గాయాలు.. గర్భస్థ శిశువు మృతి

గోపాల్‌పేట: బైక్ నడుపుతున్న వ్యక్తికి ఫిట్స్ రావడంతో కిందపడి ముగ్గురు గాయాలైన ఘటన మండల కేంద్రం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రేవల్లి మండలం కేశంపేట కొత్తతండాకు చెందిన సక్రి కోడలు వెన్నెల (తొమ్మిది నెలల గర్భిణి)కి జిల్లాకేంద్రంలో స్కానింగ్ చేయించేందుకు తన మనవడు జగదీశ్‌తో కలిసి బైక్‌పై ముగ్గురు బయల్దేరారు. గోపాల్‌పేట దాటిన తర్వాత పీఎస్‌సీ ఫంక్షన్‌హాల్ సమీపంలో బైకు నడుపుతున్న జగదీశ్‌కు ఫిట్స్ రావడంతో వాహనం రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో ఆటోలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెన్నెలకు గాయాలతో పాటు తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. సక్రి రెండు చేతులు విరిగిపోగా జగదీశ్‌కు కన్ను దగ్గర గాయమైంది. వారం రోజుల్లో ప్రసవం జరగాల్సి ఉందని.. ఇంతలోనే ఘోరం జరిగిపోయిందంటూ కుటుంబ సభ్యులు రోదించారు.

క్లుప్తంగా...

నా విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ పాత్ర కీలకం

జేఈఈ మెయిన్స్ టాపర్ రిషి శేఖర్ శుక్లా



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్‌- 2024లో 300కు గాను 300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించిన రిషి శేఖర్ శుక్లా తన విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ కీలకపాత్ర పోషించిందన్నాడు. ఆకాశ్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ ద్వారా ఆ ఇన్‌స్టిట్యూట్ గురించి తెలుసుకున్నానని, క్లాస్‌రూమ్ వాతావరణం విద్యార్థికి అనుకూలంగా ఉంటుందని చెప్పాడు. రిషి తన ప్రిపరేషన్ గురించి మాట్లాడుతూ 'నా ప్రిపరేషన్‌లో ముఖ్యంగా 4 స్టెప్స్ ఫాలో అయ్యాను. మొదటగా క్లాస్‌లో కాన్సెప్ట్స్‌ను శ్రద్ధగా వినడంపై దృష్టి సారించా. తద్వారా ప్రాబ్లమ్స్‌ను తేలిగ్గా సాధన చేసేవాడిని. ఏమైనా సందేహాలుంటే లెక్చరర్లను అడిగి తెలుసుకునేవాడిని. చివరగా ఎక్కడ తప్పు చేస్తున్నానో తెలుసుకుని సరిదిద్దుకునేవాడిని'అని వివరించాడు. తన ప్రిపరేషన్‌లో ఆకాశ్ లెక్చరర్లు తనకు అందించిన సహకారం వెలకట్టలేనిదని చెప్పారు. అలాగే తన తల్లిదండ్రులు తన విజయంలో కీలకంగా వ్యవహరించారన్నారు. స్థిరంగా కష్ట పడి చదివే గుణమే జేఈఈలో విజయాన్ని అందిస్తుందని రిషి పేర్కొన్నాడు.

ఆయిల్‌పామ్‌పై ఏపీ ప్రభుత్వం, హెచ్‌యూఎల్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ ఉత్పత్తిని పెంపొందించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)తో చర్చలు జరిపింది. ఈమేరకు హెచ్‌యూఎల్ లీగల్ కార్పొరేట్ వ్యవహారాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్‌పేయి, హెచ్‌యూఎల్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ యోగేశ్ మిశ్రా నేతృత్వంలో కంపెనీ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ఉత్పత్తి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతులకు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చేలా పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని ద్వారా దిగుమతులను తగ్గించుకోవచ్చన్నారు. ఏపీలో ఆయిల్‌పామ్‌ను 30 వేల హెక్టార్లలో సాగుకు 15 వేల మంది రైతుల భాగస్వామ్యం అవసరమని హెచ్‌యూఎల్ ప్రతిపాదించింది. నర్సరీల పెంపకం, రాష్ట్రంలో ఆయిల్ పామ్ మిల్ ఏర్పాటు ద్వారా రూ.300 కోట్లకు పైగా పెట్టుబడులు రాబట్టొచ్చని తెలిపింది. ఆయిల్‌పామ్ మిల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేవ్ బాజ్‌పేయి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

బాబు ముడుపులకు రోహిత్ వేషం!

సినిమా నిర్మాణం పేరుతో నిధుల ప్రవాహం

- రూ.5–6 కోట్ల ఖర్చుతో తూతూమంత్రంగా సినిమాలు
- రూ.30–40 కోట్లు ఖర్చయినట్లు తప్పుడు లెక్కలు
- ఇలా ఆ ఐదేళ్లలో ఫ్లాపు హీరోకు 17 సినిమాల ఛాన్స్‌లు
- ఆ తర్వాత ఇప్పటి దాకా ఒక్క సినిమా కూడా లేని వైనం
- ఖర్చులు పోగా మిగిలిన రూ.300 కోట్లు బాబు ఇంటికి
- టాక్ ఆఫ్ ది సినీ ఇండస్ట్రీగా మారిన వ్యవహారం

సీఎం హోదాలో 'సినిమా'తో వైట్.. బ్లాక్‌గా మళ్లింపు

బహుశా.. ఇలాంటి ఆలోచన ఎవరికీ వచ్చి ఉండదు. కానీ చంద్రబాబు నాయుడు ఇక్కడ!! ఆయన 'స్కిల్' మామూలుదా!! ముడుపులు పుచ్చుకోవడంలో, తీసుకున్న వాటిని తెలివిగా దారి మళ్లించి తన జేబులోకి తెచ్చుకోవడంలో ఆయన 'స్కిల్స్'ను బయటపెట్టే 'సినిమా' కథ తాజాగా బయటపడింది. ఈ కథకు హీరో ఒక్కడే. బాబు సోదరుడి కొడుకు నారా రోహిత్. నిర్మాతలుగా బయటకు వేరేవారు కనిపించినా... సహ నిర్మాతలుగా, ఫైనాన్షియర్లుగా వ్యవహరించింది మాత్రం బాబు హయాంలో వివిధ ప్రాజెక్టుల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు. తీసిందేమో ఫ్లాపు సినిమాలు. భారీగా నష్టం వచ్చిందంటూ ప్రకటనలు. చంద్రబాబుకు మాత్రం లాభాలే లాభాలు!. అదెలాగని ఆశ్చర్యపోతున్నారా? లంచాలు దిగమింగడంలో బాబు మాస్టర్‌మైండ్‌ను కళ్లకు కట్టినట్లు చూపించే టాలీవుడ్ సినిమాల కథ ఇదిగో...



బాబు హయాంలో 17 సినిమాలు

- ప్రతినిధి (2014)
- రౌడీ ఫెలో, అసుర, తుంటరి, సావిత్రి (2015)
- రాజా చెయ్యి వేస్తే, జో అచ్యుతానంద, శంకర, అప్పట్లో ఒకడుండేవాడు (2016)
- శమంతకమణి, ఒక్కడు మిగిలాడు, కథలో రాజకుమారి, బాలకృష్ణుడు, మెంటల్ మదిలో (2017)
- నీది నాది ఒకే కథ, ఆటగాళ్లు, వీరభోగ వసంతరాయలు (2018)

సాక్షి, హైదరాబాద్: అరె! ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రూపాయి లాభం తెచ్చిన పాపాన పోలేదు. ఒక్కటంటే ఒక్కటి కూడా కనీసం బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని స్థితి) సాధించింది లేదు. ప్రతి సినిమాకూ పెట్టిన పెట్టుబడిలో కనీసం 80 శాతం తిరిగి రాలేదని నిర్మాతలే చెబుతున్నారు. అలాగని అవేవీ చిన్న సినిమాలు కావు. అన్నీ 30–40 కోట్ల రేంజి బడ్జెట్ సినిమాలేనట? మరి ఇలా నష్టాలొచ్చినా సరే వదలకుండా అదే హీరోను పెట్టి వరసగా ఏడాదిలో ఆరేడు సినిమాలు తీసేశారంటే ఏమనుకోవాలి? బ్లాక్ మనీ దండిగా ఉన్నవాళ్లు కూడా నేరుగా డబ్బును కాల్చేయటం ఎందుకున్న ఉద్దేశంతో ఇలాంటి సినిమాలు తీయరు. కానీ నారా రోహిత్‌తో మాత్రం కొందరు నిర్మాతలు పదేపదే ఫ్లాప్ సినిమాలు తీశారు. ఫ్లాపు సినిమాలిచ్చిన దర్శకులతోనే మళ్లీ మళ్లీ ఫ్లాపు సినిమాలు తీశారు. ఒకసారి దర్శకత్వం వహించి ఫ్లాపు సినిమా ఇచ్చిన వ్యక్తి అదే హీరోతో మరో సినిమాకు నిర్మాతగా కూడా మారాడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఇదీ... 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక సినీతారగా మారిపోయిన 'నారా రోహిత్' కథ. విచిత్రమేంటంటే రోహిత్‌కు 2014కు ముందు పెద్దగా సినిమాలు లేవు. 2019లో చంద్రబాబు అధికారంలో నుంచి దిగిపోయాక కూడా సినిమాలు లేవు. కానీ 2014–1019 మధ్య మాత్రం ఏకంగా 17 సినిమాలు వచ్చాయి. అంటే... బాబు అధికారానికీ, నారా రోహిత్ సినిమాలకూ ఏదో సంబంధం ఉందనేగా అర్థం. అది ఏ సంబంధమంటే... ముడుపుల సంబంధం. బ్లాక్ మనీ సంబంధం బాబు ప్రభుత్వంలో కాంట్రాక్టులు పొందిన వ్యక్తులు, సంస్థలు ఆయనకు నేరుగా ముడుపులివ్వటానికి ఇబ్బంది పడ్డారు. జీఎస్టీ వచ్చాక కాంట్రాక్టర్లకు మొత్తం బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే చెల్లించాల్సి వచ్చింది. దీంతో వారు ఆ డబ్బుల్లో నుంచి ఎవరికి ఎంత చెల్లించినా ఐటీకి లెక్కలు చెప్పాల్సి వచ్చేంది. మరి బాబుకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వడమెలా? దీనికోసం మాస్టర్ మైండ్ చంద్రబాబు ఒక మార్గం కనిపెట్టాడు. తన తమ్ముడు రామ్మూర్తి నాయుడి కొడుకు నారా రోహిత్‌ను హీరోగా పెట్టి సినిమాలు తీయాల్సిందిగా తెలిసిన నిర్మాతలు, దర్శకులకు పురమాయించాడు. దానికి కావాల్సిన డబ్బులు మాత్రం ఈ కాంట్రాక్టర్లు, తన ప్రభుత్వంలో లబ్ధి పొందిన వాళ్లు సహ నిర్మాతల రూపంలోనో, ఫైనాన్సియర్లగానో చెల్లిస్తారు. ఓ 5 కోట్లతో పూర్తయ్యే సినిమాకు ఏకంగా రూ.40 కోట్ల బడ్జెట్ కేటాయించటమే కాక... అంతా ఖర్చుపెట్టినట్లు చూపిస్తారు. వాస్తవంగా రూ.5 కోట్లు ఖర్చయితే.... మిగతా రూ.35 కోట్లు నేరుగా బాబు బంగళాకు చేరిపోతాయి. ఇక ఈ సినిమా ఎలాగూ ఐదారు కోట్ల కన్నా ఎక్కువ వసూలు చేయదు. దీంతో తాము భారీగా నష్టపోయామని నిర్మాతలు ప్రకటిస్తారు.

ఇదీ... రోహిత్ ఫ్లాపుల కథ

నారా రోహిత్ యావరేజ్ నటుడు. 2009 నుంచి 2014 వరకు.. అంటే చంద్రబాబు సీఎం కుర్చీలో లేని ఆ ఐదేళ్లలో అతను నటించిన సినిమాలు నాలుగే,. బాణం (2009), సోలో (2011), సారొచ్చారు (2012), ఒక్కడినే (2013). మొదటి రెండూ యావరేజ్ కాగా, మిగిలిన రెండూ డిజాస్టర్లు. దాంతో రోహిత్‌కి సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఏడాది తర్వాత చంద్రబాబు సీఎం కాగానే రోహిత్ ముఖ 'చిత్రం' మారిపోయింది. హిట్ హీరోలకు సైతం సాధ్యం కాని స్థాయిలో వరుస పెట్టి సినీ అవకాశాలొచ్చాయి. 2019లో బాబు దిగిపోయేనాటికి ఏకంగా 17 సినిమాలు. అన్నీ ఫ్లాపులు, డిజాస్టర్లే. నిజానికి వీటిలో చాలా సినిమాలు రిలీజ్ అయిన సంగతి కూడా ప్రేక్షకులకు తెలీదు. మళ్లీ 2019లో చంద్రబాబు దిగిపోయినప్పటి నుంచి ఈ రోజు వరకు ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రోహిత్ చేయలేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇలా, అలా తిప్పి.. కొడుకు చేతికి డబ్బులు

ఒక ప్రాజెక్టు నిర్మించిన కాంట్రాక్టరుకు ప్రభుత్వం రూ.500 కోట్లు బ్యాంకు ద్వారా చెల్లింపులు చేసిందనుకోండి. ఒప్పందం ప్రకారం దీన్లో 50 శాతం అంటే రూ.250 కోట్లు ముడుపులు బాబుకివ్వాలి. నగదు రూపంలో ఇవ్వటం సాధ్యం కాదు కదా? మరి ఎలా? దీంతో కొన్ని సినిమా నిర్మాణ సంస్థలను పుట్టించారు. ఆ సంస్థల పేరిట అనేక బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేశారు. ఒక్కో ఖాతాకు చిన్న చిన్న మొత్తాల్లో ఈ రూ.250 కోట్లు తరలించారు. ఇక ఆయా ఖాతాల నుంచి డబ్బు డ్రా చేయటం కోసం సినిమా నిర్మాణం అనే పేరు పెట్టారు. రూ.2-3 కోట్లలో చుట్టేసిన చిన్న చిన్న సినిమాలకు కూడా రూ.30-40 కోట్లు అయిందని దొంగ లెక్కలు చూపించారు. సినిమాలో రోజు వారీ ఖర్చులు కింద / ప్రొడక్షన్ ఖర్చుల కింద వాటికి దొంగ బిల్లులు పెట్టారు. ప్రతి సినిమాకు రూ.20 కోట్లు- రూ.30 కోట్లు నష్టం వచ్చిందని రికార్డులు తయారు చేశారు. అలా ఎక్కడా టాక్స్ చెల్లించే సమస్య రాకుండా చూసుకున్నారు. ఇలా మొత్తం డబ్బును బ్లాక్‌గా మార్చి, అటుతిప్పి ఇటుతిప్పి ఆఖరుకు చంద్రబాబు కుటుంబ సభ్యుల చేతికి భద్రంగా చేర్చారు. ఇలా గుంటూరు జిల్లాకు చెందిన ఒక కాంట్రాక్టర్ ఒక్కడి దగ్గరే రూ.250 కోట్లు చిన్న చిన్న మొత్తాల్లో ట్రాన్స్‌ఫర్ చేయించారని ఆయనే ఇటీవల వాపోయారు. ఇలా నారా రోహిత్‌ను వాడేసుకుని 17 సినిమాలు హడావుడిగా చుట్టేసి.. చాలా మంది కాంట్రాక్టర్ల నుంచి ముడుపుల డబ్బును నారా లోకేష్‌కు అందించారు. కాంట్రాక్టర్‌లే కాకుండా కొన్ని వ్యాపార సంస్థల నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు దండుకున్నారని తెలిసింది.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- బడా స్టార్స్, క్రేజీ హీరోలకు తప్ప మరే హీరోదైనా ఒక సినిమా డిజాస్టర్ అయింది అంటే రెండో సినిమా అవకాశం కనాకష్టం అలాంటిది వరుసగా ఇన్ని సినిమాల్లో నారా రోహిత్ ఎలా చేయగలిగాడు?
- ఆయన సినిమాల బిజినెస్, కలెక్షన్ల ప్రకారం .. ప్రతి సినిమా రూ.20, 30 కోట్లకు పైగా భారీ నష్టాలు మూటగట్టుకుంది. అయినా కూడా నిర్మాతలు వరుస కట్టి అదే హీరోతో పదే పదే సినిమాలు ఎందుకు తీశారు?
- అతి కొద్ది మంది తప్ప నారా రోహిత్‌తో సినిమాలు తీసిన వారిలో ఎవరూ అంతకు ముందు భారీ చిత్రాలు తీసిన చరిత్ర ఉన్న నిర్మాతలు కాకపోవడం గమనార్హం. అలాంటప్పుడు వారు ఈయనతోనే మళ్లీ భారీ చిత్రాలు ఎందుకు తీశారు?
- నారా రోహిత్ సినిమా నిర్మాతల్లో పలువురికి తెలుగుదేశం పార్టీతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు ఉండడం వెనుక మతలబు ఏమిటి?

దొంగ లెక్కలతో బురిడీ

ఆయా సినిమాల అంచనా వ్యయం, లాభ నష్టాలు, వాస్తవ బడ్జెట్ వంటివన్నీ పరిగణనలోకి తీసుకుంటే.. హీరో రెమ్యునరేషన్‌తో సహా నారా రోహిత్ సినిమా బడ్జెట్ ప్రొడక్షన్ స్టార్ కాంబినేషన్‌ను బట్టి రూ.5–10 కోట్లు లోపు మాత్రమే. అయితే రోహిత్‌తో సినిమాలు తీసిన నిర్మాతలు మాత్రం వీటి బడ్జెట్ రూ.30 నుంచి 40, 45 కోట్ల దాకా కూడా చెబుతూవచ్చారు. అదే విధంగా వాళ్ల బంధు గణంతోనే డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ అవతారాలు ఎత్తించి థియేట్రికల్ రైట్స్‌ను రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లకు కొనిపించినట్లు చూపారు. అంటే ఆ సినిమాలు తీసేవాడూ, వాటిని కొనేవాడూ ఇద్దరూ ఒకరేనని తెలుస్తోంది. సినిమా ఆడలేదు కాబట్టి.. తమకు ఇంత నష్టం వచ్చిందని ప్రభుత్వానికి ఈ ముఠా దొంగ లెక్కలు చూపించింది. ఇలా రోహిత్ సినిమాల ద్వారా లంచాల రూపంలో వచ్చిన బ్లాక్ మనీ సుమారు రూ.300 నుంచి 400 కోట్ల వరకు దండుకున్నారని అంచనా.

ఏపీపీఎస్సీ.. మరో ఐదు

- వారంలో వెలువడనున్న నోటిఫికేషన్లు
- అటవీశాఖలో 861 పోస్టుల భర్తీకి సిద్ధం
- విద్యుత్, మత్స్య, జైళ్ల శాఖలు, గణాంకాల విభాగంలో ఖాళీల భర్తీ



సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు శుభవార్త! ఇప్పటికే గ్రూప్‌- 1, 2 పోస్టులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చిన ఏపీపీఎస్సీ త్వరలో అటవీ శాఖలో పలు ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వడంతో ఈమేరకు వివిధ కేటగిరీల్లో 861 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ల జారీకి చర్యలు చేపట్టింది. ఒకవైపు గ్రూప్–2 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు అటవీశాఖ ఉద్యోగాల భర్తీకి సన్నద్ధమైంది. మరో వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు వెలువడనున్నట్లు సమా చారం. వీటిలో 37 ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు, 70 ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, 175 ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, 375 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, 10 తానా దార్లు, 12 టెక్నికల్ అసిస్టెంట్లు, మరో 10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కలిపి 689 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి లభించింది. ఇవి కాకుండా ఎఫ్ఎస్ఓ, బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ లాంటి మరో 172 క్యారీ ఫార్వర్డ్ పోస్టులతో కలిపి మొత్తం 861 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌తో పాటు పరీక్షల షెడ్యూల్‌ను కమిషన్ త్వరలో ప్రకటించనుంది. ఇవే కాకుండా విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, మత్స్యశాఖలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్టు పోస్టు, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ విభాగంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన



ఖైరతాబాద్ (హైదరాబాద్): సచివాలయం ఎదురుగా భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ విగ్రహ శంకుస్థాపనకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంతరావు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపులో మహిళలదే కీలకపాత్ర

- రాష్ట్రంలో 12కు పైగా ఎంపీ సీట్లు గెలుస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో మహిళలదే కీలకపాత్ర అని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీతారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ మండల, బ్లాక్, బూత్, గ్రామ స్థాయిల్లో మహిళా కాంగ్రెస్‌ను పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 12కి పైగా పార్లమెంట్ స్థానాలను గెలుపే లక్ష్యంగా పార్లమెంటరీ స్థాయి మహిళా కాంగ్రెస్ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ నిలబడినా వారిని గెలిపించాల్సిన బాధ్యత మహిళా కాంగ్రెస్‌పై ఉందన్నారు. మహిళా ఓటు బ్యాంక్ కీలకమైనదని, మహిళలతోనే విజయం సాధ్యమైందన్నారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 33 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తనకు గోషామహల్ టికెట్ ఇచ్చి పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేక ప్రచారానికి మహిళా కాంగ్రెస్ అడ్డుకట్టవేస్తుందన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో రాకుండా బహిరంగ సభలో మాట్లాడడం సరికాదన్నారు. ఇంకా మేము అధికారంలో ఉన్నట్లు ఇష్టానుసారంగా మాట్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్‌కు కూడా దక్కదన్నారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, వివిధ అసెంబ్లీ, మండలాల అధ్యక్షులుపాల్గొన్నారు. అంతకుముందు జిల్లా అధ్యక్షురాలు వసంత ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పార్లమెంటరీ మహిళా కాంగ్రెస్ సమీక్ష నిర్వహించారు.






మోదుగు పూల కనువిందు

మహబూబ్‌నగర్ – నవాబుపేట ప్రధాన రహదారి ఇరువైపులా విరబూసిన మోదుగ పూలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. దారి పొడవునా మోదుగ పూల సోయగం అందరినీ ఆకట్టుకుంటోంది. శంఖం, కలశం, త్రిశూలం ఇతర ఆకారాల్లో పుష్పాలు విరబూసి, ప్రకృతికే సరికొత్త అందాన్నిస్తున్నాయి.

– నవాబుపేట

మరోసారి రోడ్డెక్కిన రైతులు

- వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్
- వ్యాపారులు, రైతుల మధ్య కొలిక్కిరాని చర్చలు



అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

అచ్చంపేట: వేరుశనగ రైతు పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. తగ్గుతున్న ధరలతో కనీసం పెటుబడులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోతోందని రోడ్డెక్కుతున్నారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతులు బుధవారం మరో సారి ఆందోళనకు దిగారు. 669 మంది రైతులు 10,149 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌లో విక్రయానికి తీసుకురాగా.. గరిష్టంగా రూ.7,029, కనిష్టంగా రూ.5,015, మధ్యస్థంగా రూ.6,380 ధరలు వచ్చాయి. వ్యాపారులు ప్రకటించిన ధరలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వినకుండా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకుడు బాలాజీ, సీపీఎం నాయకులు దేశ్యానాయక్, మల్లేష్ మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాము పోలీసు సిబ్బందితో అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో రైతులు, వ్యాపారులతో అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పలు దఫాలుగా చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. క్వింటాకు కనీసం రూ.200 పెంచాలని రైతులు కోరగా.. ధరలు పెంచే ప్రసక్తే లేదని, అందరి అభిప్రాయం మేరకు అవుటాన్ (గ్రాము) లెక్కలు తీస్తామని వ్యాపారులు ఒప్పుకొన్నారు. ఇందుకు రైతులు సమ్మతించడంతో ఆందోళన సద్దుమణిగింది. మూడు గంటల పాటు అంబేద్కర్ చౌరస్తా, మార్కెట్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. కాగా అచ్చంపేటలో రైతులు ఆందోళనకు దిగడం ఇది మూడో సారి.

మూడు రోజులు మార్కెట్‌కు పంటను తేవొద్దు..

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం నుంచి మూడు రోజుల పాటు వేరుశనగను తేవద్దని మార్కెట్ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. బుధవారం రైతుల ఆందోళనతో మార్కెట్‌లో వేరుశనగ నిల్వలు అలాగే ఉన్నాయని, గురువారం మార్కెట్‌లో టెండర్ ప్రక్రియ నిర్వహించడం లేదన్నారు. ఈనెల 16న భారత్‌బంద్, 17న వారాంతపు సెలవు కావడంతో పంటల కొనుగోలు 18న ప్రారంభమవుతాయని చెప్పారు. గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ మార్కెట్ల రేట్లను కూడా మార్కెట్ ధరల పట్టికపై ప్రదర్శిస్తామని తెలిపారు.

తగ్గిన ఉల్లి ధరలు

గరిష్టం రూ.1,400.. కనిష్టం రూ.700



మార్కెట్ ఆవరణలో ఉల్లి కుప్పలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం నిర్వహించిన వేలంలో ఉల్లి ధరలు మరింత పడిపోయాయి. గత నెల సీజన్ ప్రారంభం కాగా ప్రతి వారం మార్కెట్‌కు పెద్దఎత్తున ఉల్లి విక్రయానికి వస్తోంది. సీజన్‌కు ముందు క్వింటా ఏకంగా రూ.6 వేల వరకు ధర పలికింది. రానురాను తగ్గుముఖం పడుతూ రూ.3 వేలకు పడిపోయింది. డిసెంబర్ చివరి వరకు రూ.2 వేలు నిలకడగా ఉండగా.. జనవరి ప్రారంభం నుంచి ప్రతి వారం ధర తగ్గుతూ వస్తోంది. గత వారం క్వింటా రూ.1,800 వరకు పలకగా.. ఈ వారం నాణ్యమైన ఉల్లికి గరిష్టంగా రూ.1,400, రెండోరకం ఎర్ర ఉల్లికి కనిష్టంగా రూ.700 ధరలు వచ్చాయి.

జోరందుకున్న వ్యాపారం..

ధరలు తగ్గడంతో కొనుగోలుదారులు పెద్దఎత్తున మార్కెట్‌కు వస్తున్నారు. నాణ్యమైన ఉల్లి 45 కిలోల బస్తా ధర రూ.600 నుంచి రూ.700 వరకు.. రెండోరకం ఉల్లి బస్తా ధర రూ.350 నుంచి రూ.500 వరకు విక్రయించారు. మార్కెట్‌కు సుమారు నాలుగు వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో మార్కెట్ ఆవరణ ఉల్లి కుప్పలతో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి ప్రత్యేక వాహనాల్లో తరలించారు.

తండ్రిది బతుకుపోరు.. కుమార్తె నిద్ర జోరు



ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదని చెబుతుంటారు పెద్దలు. నిద్రించేందుకు మెత్తటి పరుపు అక్కర్లేదు. పండ్ల గంప అయినా పర్వాలేదనుకుంది ఓ నాలుగేళ్ల చిన్నారి. తండ్రితో పాటు జామకాయలను విక్రయించేందుకు వెళ్లిన చిన్నారి.. ద్విచక్ర వాహనంపై ఉన్న పండ్ల గంపలో ఆదమరచి నిద్రపోతుండగా.. తండ్రి బకుతు పోరు సాగిస్తున్న దృశ్యాన్ని బుధవారం గద్వాల పట్టణంలోని రాజీవ్ మార్గ్‌లో 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– గట్టు

అనుమతులకు మించి ఇసుక రవాణా



సల్కెలాపురానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అందుకు అవసరమైన ఇసుక కోసం ఒక్కో ట్రిప్ (ట్రాక్టర్)కు రూ.1,132 చొప్పున డీడీ చెల్లించి, అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు స్థానికంగా ఉండే వాగుల నుంచి ఇసుక తరలించుకోవాలని ప్రభుత్వం అనుమతులిచ్చింది. కాగా, ఖిల్లాఘనపురంలో నిర్మించే సీసీరోడ్లకు 105 ట్రిప్పుల ఇసుక అవసరం కాగా.. కేవలం 10 ట్రిప్పులకు మాత్రమే డీడీలు చెల్లించారు. అప్పారెడ్డిపల్లిలో 60 ట్రిప్పులకుగాను 10 ట్రిప్పులు, కమాలొద్దీన్‌పూర్‌లో 90 ట్రిప్పులకుగాను 5 ట్రిప్పులు, వెనకితండాలో 45 ట్రిప్పులకుగాను 10, సల్కెలాపురంలో 80 ట్రిప్పులకుగాను 10 ట్రిప్పులకు డీడీలు చెల్లించి, తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతులు తీసుకున్నారు. ఇదే అదునుగా తీసుకున్న కొందరు.. 30నుంచి 40 ట్రిప్పుల వరకు ఇసుకను అక్రమంగా తరలించారు. ఖిల్లాఘనపురం, వెనకితండాలకు పలు కారణాలతో ఇసుక తరలించలేదని తెలుస్తోంది. ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను అక్రమంగా తరలించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని.. సంబంధిత అధికారులు స్పందించి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పాండునాయక్‌ను వివరణ కోరగా, ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.1,132 చొప్పున డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇసుక తరలింపుపై పోలీసుల సహకారంతో నిఘా పెడతామని తెలిపారు.

కాండం తొలుచు పురుగు నుంచి పంటలను కాపాడుకోవాలి



జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

రాజాపూర్: యాసంగి వరిలో కాండంతొలుచు పురుగు ఉధృతమవుతుందని, ఈ తరుణంలో రైతులు ఆది నుంచే నివారణ చర్యలు చేపట్టి వరి పంటను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దొండ్లపల్లిలో వరిపంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ వరిపైర్లు నారుమడి దశలోనే ఉన్నాయని, కాండంతొలుచు పురుగు, రెక్కల పురుగు ఉధృతి ఎక్కువగా కనిపించిందన్నారు. దీని నివారణకు పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎరను, సోలార్‌దీపం ఎరను, లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకుని రెక్కలపురుగులపై నిఘా పెట్టాలన్నారు. పిలకదశలో ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలను అందులో వారానికి 25 నుంచి 80 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. ఈ యాసంగిలో నారుమడి దశలో ఆశించి నష్టపరుస్తుంది. నారుమడిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలన్నారు. ఒకవేళ నారుమడిలో వేయకుంటే 15 రోజుల వయసున్న పిలకదశలో ఉన్న వరిపైరులో తప్పకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 4 కిలోలు 20.25 ఇసుకలో కలిపి బురద పదునులో వేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా మోగిపురుగు నివారణకు సిఫారసు చేయబడని ఇతర 10జీ లేదా సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి వేయడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలన్నారు. రెండు సంవత్సరాలుగు ఈ చీడపురుగులు పంటలను ఎక్కువగా నష్ట పరుస్తున్నాయని తెలిపారు. ఏఓ జాలరి నరేందర్, ఏఈఓ మేఘనాథ్, రైతులు బోయచెన్నయ్య, కావలి కృష్ణయ్య పాల్గొన్నారు.